# పులకించిన మంజీర.. ఖేడ్‌లో పరేడ్

- బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు కదిలొచ్చిన జనం
- బాన్సువాడ, నారాయణఖేడ్, జుక్కల్ గులాబీమయం
- సీఎం కేసీఆర్ రాకతో పరవశించిన త్రివేణి సంగమం
- అధినేత ప్రసంగానికి ఉర్రూతలూగిన నారాయణఖేడ్


జుక్కల్ ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన జనం, బీఆర్‌ఎస్ శ్రేణులు


బాన్సువాడ సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో ఉత్సాహంతో యువత కేరింతలు

నిజామాబాద్/సిద్దిపేట, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాకతో నారాయణఖేడ్ ఆనంద నృత్యం చేయగా.. మంజీరా తీరం పులకించి పోయింది. మూడు రాష్ట్రాల కూడలి గులాబీమయమైంది. జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలు దిగ్విజయవంతమయ్యాయి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు అనుబంధంగా ఉన్న జుక్కల్‌తోపాటు బాన్సువాడకు ప్రజలు పోటెత్తారు. సీఎం కేసీఆర్ రాకతో భౌగోళిక త్రివేణి సంగమ ప్రాంతం పరవశించింది. రెండు గంటల వ్యవధిలో రెండు సభలకు కేసీఆర్ హాజరై రణన్నినాదం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని, పార్టీ అభ్యర్థులైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్ షిండేలకు భారీ మెజార్టీ కట్టబెట్టాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార సభలు జన సునామీని తలపించాయి. మధ్యాహ్నం 3 గంటలకు జుక్కల్ చౌరస్తాలోని సభకు కేసీఆర్ హాజరయ్యారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు బాన్సువాడ పట్టణ కేంద్రంలోని వీక్లీ మార్కెట్ మైదానంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్ సభలో పాల్గొన్నారు. లక్షలాది మంది తరలి రావడంతో రెండు నియోజకవర్గాలు గులాబీమయమయ్యాయి. నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు ఏటా రెండు పంటలు పండింకొనే అవకాశాన్ని కల్పించినందున రైతన్నలంతా తండోపతండాలుగా తరలి వచ్చి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. జుక్కల్, బాన్సువాడ సభలకు రైతన్నలు పచ్చ కండువాలతో తరలిరావడం ఆకట్టుకున్నది. 'జై కేసీఆర్ జై కిసాన్' అంటూ నినాదాలు చేస్తూ సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### పోచారం లక్ష్మీపుత్రుడు

బాన్సువాడ సభలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ అనుభవాన్ని, ఆయన పనితీరును, ప్రజల కోసం ఆయన పాటుపడే అంశాలను కేసీఆర్ మరోసారి ప్రస్తావించారు. వ్యవసాయ మంత్రిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి పడిన శ్రమను సభ సాక్షిగా చెప్పడంతో ప్రజలంతా పెద్ద ఎత్తున హర్షధ్వానాలతో హోరెత్తించారు. లక్ష్మీపుత్రుడంటూ మరోమారు కీర్తించడంతో సభా వేదికపై పోచారం భావోద్వాగానికి గురై సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీ ఖాయమైందని, వచ్చే ప్రభుత్వంలోనూ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సముచితమైన స్థానం కల్పిస్తామని, ఆయన పెద్ద పదవి అలంకరిస్తారని కేసీఆర్ ప్రకటించారు. జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను ప్రజల మనిషంటూ కీర్తించారు. ఏనాడూ తన వద్దకు వ్యక్తిగత పనుల గురించి రాలేదని, వచ్చినప్పుడల్లా నియోజకవర్గ ప్రజల సమస్యలను సాదకబాధకాలను తీర్చాలంటూ కోరారని కేసీఆర్ గుర్తు చేశారు. జుక్కల్‌లో షిండేకు భారీ మెజార్టీ ఇవ్వాలని ప్రజలను కేసీఆర్ కోరారు.

### నారాయణఖేడ్ హీరో భూపాల్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో ఇక్కడి ప్రాంతాన్ని గుర్తు చేసినప్పుడు ప్రజలు ఈలలు వేస్తూ హర్షధ్వానాలు చేశారు. నారాయణఖేడ్ హీరో భూపాల్‌రెడ్డి అని కేసీఆర్ అన్నప్పుడు ఈలలు, చప్పట్లతో సభ మార్మోగింది. భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కేసీఆర్ కోరారు. సభలో యువత కేసీఆర్ మాస్కులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభా ప్రాంగణం చుట్టూ ఉన్న భవనాలపై నుంచి ప్రజలు సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సభలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# తెలంగాణ టీడీపీకి పార్టీ చీఫ్ గుడ్‌బై

- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా చంద్రబాబు పార్టీ
- ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించే యత్నం
- పార్టీ క్యాడర్‌కు ఆదేశాలిచ్చిన లోకేశ్
- ఈ నిర్ణయాన్ని తప్పుపట్టిన కాసాని
- తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు వెల్లడి
- సీపీఎం లోటును టీడీపీతో భర్తీ చేసేందుకు కాంగ్రెస్ యత్నం

### పోటీకి నిరాకరించినందుకే కాసాని రాజీనామా

తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవికి కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి నిరాకరించినందుకే పార్టీకి, అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఎనిమిది పేజీల లేఖను చంద్రబాబుకు పంపించారు. కాసాని జ్ఞానేశ్వర్ గత సోమవారం చంద్రబాబును రాజమండ్రి జైలులో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పోటీ చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో కాసాని జ్ఞానేశ్వర్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణలో అభ్యర్థులు సొంత ఖర్చుతో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, అయినా ఎందుకు వద్దంటున్నారో చంద్రబాబు చెప్పడం లేదని అన్నారు. లోకేశ్‌కు 20 సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని చెప్పారు. 'లోకేష్ దగ్గరకు వెళ్తే కనీసం మాట్లాడలేదు. కాంగ్రెస్‌కు సపోర్ట్ చేయాలని ఓ వర్గం వాదన తెచ్చింది. ఈ మాత్రం దానికి నన్ను పార్టీలోకి ఎందుకు పిలిచారు, ఎందుకు అధ్యక్ష పదవి కట్టబెట్టారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయాలని మొదట్లో టీడీపీ సిద్ధమైంది. అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటన కూడా చేశారు. చంద్రబాబు జైలులో ఉండటంతో ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నియమించారు. ఆయన వచ్చి ఇక్కడి నేతలతో సమావేశం నిర్వహించి, తాను కూడా ప్రచారంలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఇక అభ్యర్థులను ప్రకటించడమే తరువాయి అనుకున్న దశలో.. రేవంత్‌రెడ్డి చక్రం తిప్పారని పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఎన్ని కుట్రలు చేసైనా గెలవాలన్న ఏకైక లక్ష్యంతోనే కాంగ్రెస్ పనిచేస్తున్నదని, అందుకే ఎన్నడూ లేని విధంగా పొత్తులు, రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నదని అంటున్నారు. గత ఎన్నికల్లో కలిసి పోటీచేసిన తెలంగాణ జన సమితి పోటీ నుంచి తప్పుకోగా ఇప్పుడు టీడీపీని తప్పించారని, వచ్చే ఒకటి రెండు ఓట్లను కూడా తమకే పడేలా చేసుకోవాలనే లక్ష్యంతోనే ఈ కుట్రకు తెరలేపిందని మండిపడుతున్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై మరో కుట్రకు తెరలేచింది. అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి టీడీపీ తప్పుకున్నది. అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించినా, ప్రచారానికి సిద్ధంగా ఉన్నామని నేతలు, కార్యకర్తలు చెప్పినా.. చంద్రబాబు మాత్రం ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. ఈ అనూహ్య నిర్ణయం వెనుక కాంగ్రెస్ కుట్ర దాగున్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతోనే టీడీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్తున్నారు. రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందు కోసం చిన్నాచితకా పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నది. అయితే.. పొత్తుల కోసం కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు వరుసగా బెడిసికొడుతున్నాయి. షర్మిల హ్యాండ్ ఇవ్వగా, వామపక్షాలతో చర్చలు విఫలం అయ్యాయి. సీపీఎం ఇప్పటికే సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించగా, సీపీఐ సైతం ఇదే బాటలో నడుస్తున్నది. దీంతో కాంగ్రెస్ దిక్కుతోచని స్థితిలో పడిపోగా.. రేవంత్‌రెడ్డి తన రాజకీయ గురువు చంద్రబాబు ఆశ్రయం కోరాడని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలు మహాకూటమి పేరుతో కలిసి పోటీ చేస్తే ప్రజలు చీదరించుకున్నారు. కాబట్టి ఈసారి రహస్యంగా సహకరించుకునేలా చీకటి ఒప్పందం చేసుకున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇందులో భాగంగానే టీడీపీ ఎన్నికల బరి నుంచి తప్పుకున్నదని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలోని కార్యకర్తలు కాంగ్రెస్‌కు ఓటేయాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పినట్టు ఆదివారం వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిని అటు కాంగ్రెస్ కానీ, ఇటు టీడీపీ కానీ ఖండించలేదు. దీంతో రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం నిజమేనని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

# బీజేపీని బొందపెడుతున్న ఈటల!

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీని బొంద పెట్టాలని చూస్తున్నారని నర్సాపూర్ నియోజకవర్గ నేత సింగాయపల్లి గోపి ఆరోపించారు. నర్సాపూర్ టికెట్‌ను మురళీయాదవ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ గోపి, ఆయన అనుచరులు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ధర్నా చేశారు. భూకబ్జాలు చేసిన వ్యక్తికి, బీజేపీ కార్యకర్తలపై దాడులు చేసినవారికి టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. కష్టపడే కార్యకర్తలను వదిలి, దొంగలకు టికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థిని ప్రకటించి పది రోజులైనా నర్సాపూర్‌లో కనీసం ప్రచారం మొదలుపెట్టలేదని, అదేమని అడిగితే 'పై నుంచి రావాల్సినవి అందలేదు' అని చెప్తున్నారని, ఏం అందుతాయో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈటల పార్టీలో చేరినప్పటి నుంచే ఆధిపత్యపోరు మొదలైందని, బీజేపీని హోల్‌సేల్‌గా అమ్మాలని చూస్తున్నారని ఆరోపించారు. గోపి ధర్నా చేస్తున్న సమయంలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాష్ట్ర కార్యాలయానికి వచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం.

# కాంగ్రెస్ ఫేక్ రాజకీయాలు

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్త గటానిరాజుగా గుర్తింపు
- సోషల్ మీడియా అకౌంట్‌లో కాంగ్రెస్ పార్టీ పోస్టులు
- దుబ్బాక ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫునే ప్రచారం
- దాడిపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దొంగ మాటలు
- దాడి చేసింది బీజేపీ కార్యకర్త అని తప్పించుకొనే ప్లాన్


దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ సమక్షంలో బీజేపీలో చేరిన నర్సింహులును గటాని రాజు ఫొటోగా ఫేక్ ప్రచారం చేసిన కాంగ్రెస్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసింది కాంగ్రెస్ కత్తేనని తేలిపోయింది. అత్యంత క్రూరంగా ఈ దాడికి పాల్పడింది మిరుదొడ్డి మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గటాని రాజుగా గుర్తించారు. అతను కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నట్టు తేలింది. అయితే దాడితో తమ పార్టీకి, తమ కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా సన్నాయి నొక్కులు నొక్కారు. రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని తేలిపోయింది. సోషల్ మీడియాతో వారి బండారం బయటపడింది. దాడికి పాల్పడిన గటాని రాజు తన సోషల్ మీడియా అకౌంట్‌లో కాంగ్రెస్‌కు మద్దతుగా పోస్టులు పెట్టాడు. మెడలో కాంగ్రెస్ కండువాతో ఉన్నటువంటి ఫొటోను డీపీగా పెట్టుకున్నాడు. అంతే కాకుండా గతంలో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా విస్తృతంగా ప్రచారం కూడా నిర్వహించాడు. ఇందుకు సంబంధించి ప్రచార రథంపై తాను మాట్లాడుతున్న ఫొటోను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. తన సోషల్ మీడియా అకౌంట్‌లో 'జై కాంగ్రెస్ మిరుదొడ్డి మండల్' ట్యాగ్‌లైన్ రాసుకోవడం అతడు క్రియాశీల కాంగ్రెస్ కార్యకర్త అని చెప్పేందుకు మరో ప్రధాన సాక్ష్యం. దాడి జరిగిన తర్వాత రాజు సంబంధించి సోషల్ మీడియా పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అతను కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తేనని సోషల్ మీడియా కోడై కూసింది.

### రేవంత్ దిగజారుడు మాటలు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారనడానికి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడి ఘటన మరో సాక్ష్యంగా నిలిచింది. తన తోటి వ్యక్తిపై కత్తి దాడి జరిగితే దాన్ని ఖండించడం కనీస ధర్మం. కానీ రేవంత్‌రెడ్డి మాత్రం దాడిని ఖండించకుండా ఘటనకు రాజకీయ రంగు పులిమే కుటిల యత్నం చేశారు. అంతటితో ఆగకుండా 'మొండి కత్తి' అంటూ అవహేళనగా మాట్లాడారు. ఈ ఘటనపై అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్‌ఎస్ సానుభూతి కోసం వాళ్ల అభ్యర్థిపై మొండి కత్తితో దాడి చేయించి దాన్ని కాంగ్రెస్ ఖాతాలో రాయాలని చూస్తున్నారంటూ నిస్సిగ్గుగా ఆరోపణలు చేశారు. పైగా తప్పుడు


గులాబీ కండువాతో గటాని రాజు ఫేక్ ఫొటో

ఫొటోను పట్టుకొని ఆ అభ్యర్థి రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరాడంటూ.. ఆ వ్యక్తి తమ కార్యకర్త కాదు అని చెప్పేందుకు పచ్చి అబద్ధాలు మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా హింసను ప్రోత్సహించదంటూ సుద్దులు చెప్పారు. మరో అడుగు ముందుకేసి శాంతి అంటేనే కాంగ్రెస్ పార్టీ అంటూ గౌతమ బుద్ధుడి మాదిరిగా బోధనలు చెప్పారు. అయితే, కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియాలో వైరల్ చేసిన వీడియోలోని వ్యక్తి స్వయంగా బయటకొచ్చి తాను రాజును కాదని, తన పేరు నర్సింహులని చెప్పాడు. తాను ఆదివారం రఘునందన్ సమక్షంలో బీజేపీలో చేరానని, కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు తానే ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేశానంటూ ఆ ఫొటోను సోషల్‌మీడియాలో వైరల్ చేశారని మండిపడ్డాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలపడంతో కాంగ్రెస్ బండారం బయటపడింది. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసింది పక్కా కాంగ్రెస్ కార్యకర్తేనని తేలిపోవడం ఈ ఎన్నికల్లో తమపార్టీకి పుట్టగతుల్లేకుండా చేస్తుందని గ్రహించిన రేవంత్ రెడ్డి.. దీన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హత్యా రాజకీయాలు, ఫేక్ రాజకీయానికి పాల్పడ్డ కాంగ్రెస్‌పై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. ఇంత దారుణం జరిగినా దాన్ని ఇంకా కప్పిపుచ్చుకొనేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని కాంగ్రెస్‌పై ఫైర్ అవుతున్నారు.

# దారులేవైనా గులాబీ దరికే

- పార్టీల విలీనాలు.. అధ్యక్షుల చేరికలు
- ఆదరించి అక్కున చేర్చుకున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్


బీఆర్‌ఎస్‌లోకి నాగం జనార్దన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): కాలువలు నదుల్లో, నదులు సముద్రంలో కలిసినట్టే తెలంగాణలోని రాజకీయ పార్టీలు బీఆర్‌ఎస్‌లో విలీనం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా వ్యవహరించిన వారు సైతం గులాబీ కండువా కప్పుకున్న చరిత్ర ఉన్నది. తెలంగాణ ఉద్యమం కోసం ఏర్పాటైన పలు పార్టీల నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వ పటిమ, వ్యూహచతురత, ఆయనకున్న ప్రజాదరణ, ఆయనపై ఉన్న విశ్వాసం తదితర కారణాలతో తమ పార్టీలను బీఆర్‌ఎస్‌లో విలీనం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణకు పూర్వం, తరువాత పీసీసీకి సుదీర్ఘ కాలం అధ్యక్షులుగా పనిచేసిన నాయకులు కేసీఆర్ నాయత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని భావించి బీఆర్‌ఎస్‌లో చేరారు. గతం వారం, పది రోజులుగా రెండు పార్టీల అధ్యక్షులు, తెలంగాణ పీసీసీ తొలి అధ్యక్షుడిగా పనిచేసిన నాయకుడు సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా మరో పార్టీ వ్యవస్థాపకుడు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

### బీఆర్‌ఎస్‌లో విలీనమైన పార్టీలు, ప్రముఖులు

**ఆలె నరేంద్ర:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ సాధన సమితి (టీఎస్‌ఎస్)ను ఏర్పాటు చేసిన ఆలె నరేంద్ర అనతి కాలంలోనే కేసీఆర్ పోరాటపటిమ, వ్యూహచతురతను గుర్తించి దానిని బీఆర్‌ఎస్‌లో విలీనం చేశారు. 2004 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఐదు ఎంపీ స్థానాలను గెలుచుకున్నది. అందులో కేసీఆర్‌తోపాటు ఆలె నరేంద్ర కూడా ఉన్నారు.

**విజయశాంతి:** తల్లి తెలంగాణ పార్టీని ఏర్పాటు చేసిన విజయశాంతి కూడా ఆ పార్టీని బీఆర్‌ఎస్‌లో విలీనం చేశారు. ఆ తరువాత టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయశాంతి ఎంపీగా ఎన్నికయ్యారు.

**కే కేశవరావు:** కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కే కేశవరావు సీడబ్ల్యూసీ సభ్యుడిగా, అనేక రాష్ట్రాలకు ఇన్‌చార్జీగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, 2005–08 వరకు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమని విశ్వసించి బీఆర్‌ఎస్‌లో చేరారు. కేకే రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్‌ఎస్ పార్టీకి సెక్రటరీ జనరల్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారు.

**డీ శ్రీనివాస్:** ఉమ్మడి రాష్ట్రంలో 2004–05, 2008–11 కాలంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన డీ శ్రీనివాస్ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగానూ పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని రెండుసార్లు అధికారంలోకి తెచ్చిన పీసీసీ అధ్యక్షుడిగా గుర్తింపుపొందారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని, కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని తలచిన డీఎస్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. డీఎస్ రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని బీఆర్‌ఎస్ రాజ్యసభకు పంపింది.

**పొన్నాల లక్ష్మయ్య:** తెలంగాణ తొలి పీసీసీ అధ్యక్షుడిగా (2014–15), ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంవత్సరాలు మంత్రిగా పనిచేశారు పొన్నాల లక్ష్మయ్య. కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నదన్న ఆగ్రహంతో ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి జనగామ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

**ఎల్ రమణ:** మంత్రిగా, టీటీడీపీ అధ్యక్షుడిగా పనిచేసిన ఎల్ రమణ.. 2006 కరీంనగర్ ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌పై పోటీచేసి ఓడిపోయారు. టీడీపీ తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నదని గ్రహించిన ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

**ఎర్రబెల్లి దయాకర్‌రావు:** టీటీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఆ తరువాత రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తూ తెలంగాణ రాజకీయాల్లో అలజడి సృష్టించడాన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్‌లో చేరారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా, 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా విజయం సాధించిన దయాకర్‌రావు ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలందిస్తున్నారు.

**జిట్టా బాలకృష్ణారెడ్డి:** తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసి 'తెలంగాణ వంటకాల'ను ఉద్యమరూపాలుగా ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్‌లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన కొద్దికాలం పార్టీకి దూరంగా ఉండి 'తెలంగాణ యువజనుల పార్టీ'ని స్థాపించారు. ఇటీవల తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు.

**చెరుకు సుధాకర్:** తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్రమంతా చిరపరిచితమైన వ్యక్తి. సమైక్య పాలకులు తీవ్ర నిర్బంధాన్ని సృష్టిస్తే ప్రతిఘటించిన నాయకుడు. తొలి పీడీ యాక్ట్‌ను అనుభవించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. బీఆర్‌ఎస్ పార్టీకి కొంత కాలం దూరంగా ఉండి 'తెలంగాణ ఇంటి పార్టీ'ని స్థాపించారు. ఇటీవల తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు.

**నాగం జనార్దన్‌రెడ్డి:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాగం జనార్దన్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేశారు. వైఎస్ హయాంలో ఓబులాపురం మైనింగ్ కుంభకోణంపై పోరాటం చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. బీజేపీలో కొంతకాలం పనిచేశారు. తరువాత 'తెలంగాణ నగారా' పార్టీని స్థాపించారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. తాను కూడా బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్టు ప్రకటించడం విశేషం.

## బీజేపీ నేతల మూకుమ్మడి రాజీనామా


సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ రాణిరుద్రమకు కేటాయించడాన్ని నిరసిస్తూ 30 మంది బీజేపీ నాయకులు ఆ పార్టీకి మూకుమ్మడి రాజీనామా చేశారు. సిరిసిల్లతో ఎలాంటి సంబంధం లేని రాణిరుద్రమ ఎలా గెలుస్తుందో చూస్తామని హెచ్చరించారు. – సిరిసిల్ల టౌన్

## బీజేపీకి కార్పొరేటర్ల రాంరాం!

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 30: కరీంనగర్ నగరపాలక సంస్థలో పార్టీ కార్పొరేటర్లుగా కొనసాగుతున్న మర్రి భావన, కచ్చు రవితోపాటు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి సతీశ్ సోమవారం సాయంత్రం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోని, ప్రజలకు అందుబాటులో లేని ఎంపీ బండి సంజయ్ నాయకత్వంలో తాము ఉండలేమని స్పష్టం చేశారు.

MAHINDRA GENIO
MAHINDRA PICKUP VEHICLE - AP-09-TB-2988 - 149988 Km done its company owned vehicle, As where basis is individual preferred, Excellent condition, Brokers Excuse, Buyer Identification required. Payment by DD / RTGS only.
Vehicle inspection contact
Mr. Jagan R - 8826899880
Commercial Enquiry contact:
Tel.: 8655846819
Mon & Sat 10:30 AM to 4:30 PM

తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ
సవరణ
ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B) స్టేట్ రోడ్స్, CRN:NIT No. 67/DCE(R)/EE-R/DEE-2/AEE/2023 తేది: 27-10-2023
1) రంగారెడ్డి జిల్లాలో PLAN క్రింద 2 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ల స్వీకరణకు ముగింపు తేది: 26-10-2023న సా. 5.00 గంటల నుండి 06-11-2023న సా. 5.00 గంటలకు మార్చబడినది. సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్: సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) రూరల్ సర్కిల్, హైదరాబాద్. ఫోన్ నం. 040-23731748, సెల్ నం. 9440818043. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరఫున
DIPR R.O. No. 2099-DP/CL/Advt/1/2023-24, Dt: 30-10-2023